క్లుప్తంగా

పార్టీ బలోపేతానికి కృషి చేస్తా..



మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎన్‌వీ రమణారెడ్డి

ప్రొద్దుటూరు : మండలంలోని కొత్తపల్లె గ్రామ పంచాయతీ ఖాదరబాద్ గ్రామానికి చెందిన ఎన్‌వీ రమణారెడ్డి వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శిగా నియమితులయ్యారు. సోమవారం మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాదరెడ్డిని రమణారెడ్డి కలిసి పుష్పగుచ్ఛం కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకంతో ఈ పదవి ఇచ్చినందుకు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సానబోయిన శేఖర్ యాదవ్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మార్తల ఓబుళరెడ్డి, కొత్తపల్లె పంచాయతీ మాజీ సర్పంచ్ గురుస్వామి పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ పరామర్శ



మణికంఠను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి

బద్వేలు అర్బన్ : ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై చికిత్స చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న మాజీ కుడా చైర్మన్ గురుమోహన్ అల్లుడు మణికంఠను సోమవారం ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి పరామర్శించారు. ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, రంగసముద్రం సర్పంచ్ చిత్తారవిప్రకాష్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి రామసుబ్బారెడ్డి, ఆయా కార్పొరేషన్ల డైరెక్టర్లు కేశవరెడ్డి, పుత్తాశ్రీ రాములు, జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్‌బాబు పాల్గొన్నారు.

అన్నదానం

ప్రొద్దుటూరు : స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో సోమవారం మధ్యాహ్నం శివోహం అన్నప్రసాద సేవా సంఘం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు శెట్టిపల్లె రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ రాస్ వ్యవస్థాపకుడు మునిరత్నం నాయుడు జయంతిని పురస్కరించుకుని రాస్ సభ్యుడు, రిటైర్డు ఆర్టీసీ ఉద్యోగి కేవీ ప్రసాద్, వారి కుటుంబ సభ్యుల సహకారంతో అన్నప్రసాద సేవా కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. సుమారు 800 మంది అన్నప్రసాదాన్ని స్వీకరించారన్నారు. ఈ కార్యక్రమంలో శివోహం అన్నప్రసాద సేవా సంఘం ఉపాధ్యక్షుడు మురుకూటి సూర్యనారాయణ రెడ్డి, విష్ణు నారాయణ, విజయకుమార్, వెంకటేశ్వరరెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, భాస్కర్, దేవానంద్ తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల ఆకాంక్షలను నెరవేర్చాలి

కాశినాయన : విద్యార్థులు చక్కగా చదివి విద్యలో రాణించి తల్లిదండ్రుల ఆకాంక్షలను నెరవేర్చాలని రాష్ట్రపతి అవార్డు గ్రహీత దాదాపీర్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవీంద్రబాబులు తెలిపారు. సోమవారం మండలంలోని రెడ్డికొట్టాల ప్రాథమికోన్నత పాఠశాలలో ఇటీవల మండల స్థాయిలో, జిల్లా స్థాయిలో జరిగిన సైన్స్ వైజ్ఞానిక ప్రదర్శనలో రేష్మాబీ, అబీన్నిసా అనే విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. వీరికి పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ రవికుమార్, వైస్ చైర్మన్ బేగంలు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పరిమళజ్యోతి, వాకాచంద్రశేఖర్, సురేష్‌కుమార్, మహేష్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

385 మందికి నోటీసుల జారీ

ప్రొద్దుటూరు : గోపవరం గ్రామ పంచాయతీ పరిధిలోని కాలువకట్ట వీధి వాసులైన 385 మందికి గ్రామ పంచాయతీ కార్యదర్శి పేరుతో నోటీసులు జారీ చేశారు. మైలవరం ఉత్తర కాలువపై అక్రమ కట్టడాలు చేపట్టారని ప్రొద్దుటూరు అదనపు సెషన్ జడ్జి, పంచాయతీరాజ్ శాఖ ఆదేశాల మేరకు ఈ నోటీసులు జారీ చేసినట్లు గ్రామ పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ పేర్కొన్నారు. యనమల ప్రతాప్‌రెడ్డి అనే వ్యక్తి లోక్ అదాలత్‌లో మైలవరం కాలువను ఆక్రమించారని వేసిన పిటీషన్ మేరకు కాలువపైన ఉన్న ఆక్రమణలను తొలగించేందుకు, కాలువలో పూడిక తొలగించేందుకు ఈ నోటీసులు జారీ చేసినట్లు ఆయన తెలిపారు. కాగా నోటీసులలో గ్రామ పంచాయతీ కార్యదర్శి సంతకాలు ఎక్కడా లేకపోవడంతో ప్రజలు విమర్శిస్తున్నారు. కాలువ కట్టపైన నిర్మించిన ఇళ్లను కూడా కూల్చేస్తారేమోనని అక్కడి ప్రజలు ఆందోళన చెందుతున్నారు. నోటీసులు తీసుకున్న వెంటనే ప్రజలు బిక్కుబిక్కుమంటూ స్థానిక ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డిని కలిసి తమ ఆవేదన వెలిబుచ్చారు. తాము అత్యంత పేదవారమని, ఇళ్లను కూల్చివేస్తే ఆర్థికంగా కోలుకోలేమని ఆవేదన వ్యక్తం చేశారు.

కోడి పందెం ఆటగాళ్ల అరెస్ట్

పోరుమామిళ్ల : రామేశ్వరం గ్రామంలో కోడి పందెం ఆడుతున్న ఎనిమిది మందిని ఆదివారం సాయంత్రం అరెస్టు చేసి, వారి నుంచి రూ.4,420 పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఒక కోడిని కూడా స్వాధీనం చేసుకోవడం జరిగింది. వారిపై కేసు నమోదు చేసి సోమవారం కోర్టులో హాజరు పెడుతున్నట్లు ఎస్ఐ కొండారెడ్డి చెప్పారు.

పెద్దాయన.. అసాంఘిక కార్యక్రమాలను అడ్డుకోలేరా?

- గుట్కా, మట్కా, బెల్ట్ షాపులు, జూదం విచ్చలవిడిగా జరుగుతోంది
- మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



గోవా మద్యం బాటిల్‌ను చూపుతున్న మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : గుట్కా, మట్కా, క్రికెట్ బెట్టింగ్, ఇసుక మాఫియా, రేషన్ మాఫియా విచ్చల విడిగా ఉందని తనను గెలిపిస్తే అసాంఘిక కార్యక్రమాలను రూపుమాపుతానని గొప్పలు చెప్పిన ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి అధికారంలోకి వచ్చి ఏడు నెలలైనా ఎందుకు అడ్డుకట్ట వేయలేకపోతున్నారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. సోమవారం ప్రొద్దుటూరులోని తన స్వగృహంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్యే వీటిని నియంత్రించలేకపోవడానికి కారణం ఆదాయం కోసమా.. లేక రాజకీయ ప్రయోజనమా అని ప్రశ్నించారు. ఎన్నికలకు ముందు టీడీపీ నేతలు తనపై బురద చల్లి తన సహనాన్ని పరీక్షించారన్నారు. రాజన్న భోజనం ద్వారా పేదలకు అన్నం పెడుతున్నా ఈ డబ్బు అసాంఘిక కార్యక్రమాల ద్వారా సంపాదించానని తన మనసు నొచ్చుకునేలా మాట్లాడారన్నారు. తన భార్య, పిల్లలు తినే అన్నం కూడా ఇదేనని చెప్పడం ఒక్కటే తక్కువ అన్నారు. నాలుగు ఓట్లు సంపాదించేందుకు ఆ నాడు ప్రచారం చేశారని, తమ తప్పొప్పులను కప్పి పుచ్చుకునేందుకు ఇప్పటికీ తనపై ఇదే ప్రచారం చేస్తున్నారన్నారు. తల్లిదండ్రుల సాక్షిగా అని చెప్పినా తనను ఎగతాళి చేశారన్నారు. తన కోసం ఎన్నో త్యాగాలు చేసిన తన సోదరుడు కిరణ్‌కుమార్‌రెడ్డిని కూడా ఆర్‌బీకే అని ప్రచారం చేశారన్నారు. తాను అధికారంలోకి వస్తానే అసాంఘిక కార్యక్రమాలపై ఉక్కు పాదం మోపుతానని ప్రగల్భాలు పలికిన ఎమ్మెల్యే వరద ఏమిచేస్తున్నారని అన్నారు. ప్రవీణ్ కుమార్‌రెడ్డి ప్రొద్దుటూరుకు రెండో మైసూరు అని పేరు ఉందని, షుకూర్ బిరియానికి ప్రత్యేకత ఉందని, ప్రస్తుతం రాచమల్లు హయాంలో అసాంఘిక కార్యక్రమాలకు అడ్డా అయిందని విమర్శించారన్నారు. నేడు ఎందుకు రాజకీయ భవిష్యత్తు కలిగిన ప్రవీణ్ ఈ అంశాన్ని ప్రస్తావించలేకపోతున్నారన్నారు. నిజాయితీ ఉంటే ప్రభుత్వానికి ఫిర్యాదు చేయాలని కోరారు. వరద శకం ఈ ఎన్నికలతో ముగిసిపోతుందని, 2029లో ఎన్నికల్లో తనకు ప్రవీణ్ రాజకీయ ప్రత్యర్థి అయ్యే అవకాశం ఉందన్నారు. రోజూ రూ.కోటి మట్కా ప్రొద్దుటూరులో రోజూ రూ.కోటి మట్కా జరుగుతోందని మాజీ ఎమ్మెల్యే రాచమల్లు తెలిపారు. 150 మంది మట్కా రాస్తున్నారని, 8 మంది ప్రధానంగా దీనిని నిర్వహిస్తున్నారన్నారు. మాజీ కౌన్సిలర్ భర్తతోపాటు కొంత మంది అధికార పార్టీ కౌన్సిలర్లకు ఇందులో ప్రమేయం ఉందని ఆరోపించారు. 19వ వార్డు కౌన్సిలర్ మునీర్‌ను ఇటీవల పోలీసులు అరెస్టు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. మట్కా నిర్వహణకు సంబంధించిన ఆధారాలన్నీ తన వద్ద ఉన్నాయన్నారు. విచ్చల విడిగా కంపెనీలు నిర్వహిస్తున్నా ప్రభుత్వం చూసి చూడనట్లు వ్యవహరిస్తోందన్నారు. బియ్యం అక్రమ రవాణాకు సంబంధించి గతంలో తనపై ఎన్నో రకాల ఆరోపణలు చేశారన్నారు. మీ ప్రభుత్వ హయాంలో స్వయంగా కౌన్సిలర్ ఇంటిలో బియ్యం దొరికినా పట్టించుకోలేదన్నారు. ఇందులో కూడా కొంత మంది ముఖ్యమైన కౌన్సిలర్లు కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. వీరంతా కలిసి రేషన్ బియ్యాన్ని అక్రమంగా జిల్లా దాటిస్తున్నారన్నారు. మీ పత్రిక ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనాన్ని చూడాలని కోరారు. రేషన్ బియ్యానికి సంబంధించిన ఓ నాయకుడు, ఓ మట్కా నిర్వాహకుడు మీ ఫ్లెక్సీలు వేసిన విషయం మీరు చూడలేదా అని ప్రశ్నించారు. విచ్చల విడిగా గ్రామాల్లో మద్యం బెల్ట్ షాపులు టీడీపీ కార్యకర్తలు నిర్వహిస్తున్నారన్నారు. పట్టణంలో ఇతర రాష్ట్రాల మద్యాన్ని కూడా తెప్పిస్తున్నారన్నారు. గోవాలో రూ.750 ఉండే వైన్ బాటిల్ ఇక్కడ రూ.3వేలకు అమ్ముతున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మద్యం కన్నా ఇతర రాష్ట్రాల మద్యం బాగుందని తెప్పిస్తున్నారన్నారు. ఇందులోనాలుగురు ప్రధాన వ్యాపారులు ఉన్నారన్నారు. ఓ ముఖ్యమైన టీడీపీ కౌన్సిలర్ గోవా ట్రిప్‌ను ఏర్పాటు చేసి అక్కడ క్యాసినోను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారన్నారు. తద్వారా ఆ కౌన్సిలర్ లక్షల రూపాయలు గడించే అవకాశం ఉందన్నారు. తమ ప్రభుత్వ హయాంలో పూర్తిగా క్లబ్‌లను మూసివేశారన్నారు. ఇప్పుడు స్వయంగా ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి జార్జిక్లబ్‌ను తెరిపించాలని ఎస్పీని కోరడం ఇక్కడ జూదం అడటం జరుగుతోందన్నారు. అందరికంటే ముందుగా చౌటపల్లె గ్రామంలో జూదం నిర్వహించిన విషయాన్ని తెలిపారు. జమ్మలమడుగుతోపాటు ప్రొద్దుటూరులో కూడా జూదం నిర్వహణకు ఏర్పాట్లు చేశారన్నారు. గుట్కా అమ్మకాలలో తనకు సంబంధం ఉందని గతంలో ప్రచారం చేసిన ఎమ్మెల్యే ఇప్పుడు ఎందుకు వీటిని నియంత్రించలేకపోతున్నారని రాచమల్లు ప్రశ్నించారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, ఎంపీపీ శేఖర్ యాదవ్, కోఆపరేటివ్ స్టోర్స్ అధ్యక్షురాలు గజ్జల కళావతి, కౌన్సిలర్లు భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి, నూకా నాగేంద్రారెడ్డి, వరికూటి ఓబుళరెడ్డి, గరిశపాటి లక్ష్మీదేవి, లావణ్య, సత్యం, వైఎస్సార్‌సీపీ నాయకుడు రమణారెడ్డి పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

మైదుకూరు : మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శ్రీధర్ నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక మండల పరిషత్ సభాభవనంలో నిర్వహించే సమావేశంలో తాగునీరు, పారిశుధ్యం, వ్యవసాయం, రెవెన్యూ, గృహ నిర్మాణం, విద్య, వైద్య ఆరోగ్యం, గ్రామీణ ఉపాధి, నీటిపారుదల తదితర అంశాల ప్రగతిపై సమీక్ష ఉంటుందని పేర్కొన్నారు. సమావేశానికి అధికారులు, సభ్యులు పాల్గొనాలని కోరారు.

వలంటీర్లకు కూటమి ప్రభుత్వం మోసం

చాపాడు : ఎన్నికలకు ముందు వలంటీర్ల జీతాలు రెట్టింపు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం నిలువునా మోసం చేసిందని వైఎస్సార్‌సీపీ నేత, ఏపీఎస్ ఆర్టీసీ మాజీ జోనల్ చైర్మన్ రెడ్యం వెంకటసుబ్బారెడ్డి ఎద్దేవా చేశారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో వలంటీర్ల జీతం రూ.5వేల నుంచి రూ.10వేలకు పెంచుతామని చెప్పడం.. ఇప్పుడు మాటమార్చడం చూస్తే ఓడ మల్లన్న ఏరుదాటాక బోడి మల్లన్న అన్నట్లుందని ఆయన విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన ఏ హామీలను ప్రభుత్వం సక్రమంగా అమలు చేయడం లేదన్నారు.

రేషన్ దుకాణాలపై ఆసక్తి చూపని అభ్యర్థులు

- 24 దుకాణాలకు 36 దరఖాస్తులు
- రిజర్వేషన్లలో లోపం
- 12 దుకాణాలకు దరఖాస్తులు నిల్

ఖాజీపేట : మండలంలో 37 రేషన్ దుకాణాలు ఉన్నాయి. అందులో ఒక దుకాణానికి రెగ్యులర్ డీలర్ ఉన్నాడు. మిగిలిన 36 దుకాణాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తూ అధికారులు నోటిఫికేషన్ జారీ చేశారు. దరఖాస్తుకు 5వ తేదీ వరకు గడువు విధించారు. గడువు ముగిసే రోజుకు 36 దరఖాస్తులు అందాయి. అయితే ఇందులో 12 దుకాణాలకు ఒక దరఖాస్తు కూడా అందలేదు. 24 దుకాణాలకు గాను 36 మంది దరఖాస్తు చేసుకున్నారు.

రేజర్వేషన్ ఇలా..

రిజర్వేషన్ల ప్రకారం ఇచ్చిన నోటిఫికేషన్ సక్రమంగా లేని కారణంగా 12 దుకాణాలకు ఎవరూ దరఖాస్తు చేసుకోలేక పోయారు. అందులో భాగంగా సీ.కొత్తపేట (ఎస్టీ), దుంపలగట్టు (బీసీ–బి) సర్వర్‌ఖాన్ పేట (బీసీ–డి) అప్పనపల్లె (ఎస్సీ) రంగాపురం (ఆర్థిక బలహీనమైన విభాగం) బోసిరెడ్డిపల్లె (బీసీ–ఎమహిళ) కె. బుడ్డాయపల్లె (బీసీ–బి మహిళ) త్రిపురవరం (బీసీ–ఎ) మిడుతూరులో రెండు దుకాణాలు, సన్నపల్లె (ఎస్టీ) బి.తిప్పాయపల్లె (ఎస్సీ మహిళ)కు కేటాయించారు.

రిజర్వేషన్‌లో లోపాలు

దుకాణాలకు రిజర్వేషన్ల ఇవ్వడంలో లోపాల కారణంగా ఎవ్వరూ దరఖాస్తు చేసుకోలేక పోయారని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. అందులో ముఖ్యంగా బి తిప్పాయపల్లె, సన్నపల్లె, కె.బుడ్డాయపల్లె, కొత్తపేట, గ్రామాల్లో రిజర్వేషన్ల ప్రకారం దరఖాస్తు చేసుకునేందుకు ఆ గ్రామంలో అభ్యర్థులు ఎవ్వరూ లేరు. మిగిలిన దుకాణాల్లో దరఖాస్తు చేసుకునేందుకు రాజకీయ కారణాల వల్ల కూడా ముందుకు రాలేదని స్థానికులు అంటున్నారు.

రిజర్వేషన్లు మారుతాయి

దరఖాస్తు చేసుకోని రేషన్ దుకాణాల్లో ఎందుకు చేసుకోలేదని పరిశీలన జరుగుతుంది. మళ్లీ రిజర్వేషన్లు మార్చి నోటిఫికేషన్ ఇస్తాం. నోటిఫికేషన్ ఇచ్చి రేషన్ దుకాణాల అభ్యర్థులను ఎంపిక చేసి భర్తీ చేస్తాం.

– మహబూబ్ బాషా, తహసీల్దార్

9 రేషన్‌షాపులకు 29 దరఖాస్తులు

కలసపాడు : మండలంలో 9 రేషన్ దుకాణాలకు 29 దరఖాస్తులు వచ్చినట్లు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సింధూజ తెలిపారు. ఎగువ రామాపురం, ఎగువ తంబళ్లపల్లె, సింగరాయపల్లె, తెల్లపాడు, పిడుగుపల్లె, శంఖవరం, పుల్లారెడ్డిపల్లె, కలసపాడు, చెన్నుపల్లె రేషన్ దుకాణాలకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. సోమవారంతో దరఖాస్తు గడువు ముగియడంతో 29 దరఖాస్తులు వచ్చినట్లు ఆమె తెలిపారు. వీరికి 11వ తేదీన బద్వేలులో పరీక్ష ఉంటుందన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

అట్లూరు : అట్లూరు మండల పంచాయతీ కార్యదర్శుల సంఘం కార్యవర్గాన్ని సోమవారం సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా కె.సుధాకర్‌బాబు, ఉపాధ్యక్షుడుగా ఎ.ఆనంద్‌రావు, జనరల్ సెక్రటరీగా ఎం.నరేంద్రయాదవ్, ట్రెజరర్‌గా బి.స్రవంతి, సలహాదారుగా కె.కేశవరెడ్డి ఎన్నికయ్యారు.

పెద్ద సూరారెడ్డి కుటుంబానికి పరామర్శ

ఖాజీపేట : రావులపల్లె గ్రామానికి చెందిన పోలు పెద్ద సూరారెడ్డి (75) అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన కుటుంబాన్ని ఏపీఎస్ ఆర్టీసీ మాజీ జోనల్ అధ్యక్షుడు రెడ్యం వెంకసుబ్బారెడ్డి సోమవారం పరామర్శించారు. మృతికి గల కారణాలను తెలుసుకొని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. అలాగే అదే గ్రామానికి చెందిన ముమ్మడి శివానంద రెడ్డి రోడ్డు ప్రమాదంలో గాయపడి ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటుండగా అతడిని పరామర్శించారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో సోమవారం ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన 2025 క్యాలెండర్, డైరీ, జీఓల సంపుటిని ఎంఈఓ సావిత్రమ్మ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నూతన సంవత్సరం అందరికీ శుభాలు తేవాలని ఆకాంక్షించారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డి మాట్లాడుతూ డైరీలో ఉద్యోగ, ఉపాధ్యాయుల సర్వీసు పరమైన విషయాలతోపాటు వేతన స్కేల్‌ల వివరాలు, సెలవు నిబంధనలను, పీఆర్సీ పట్టికలను సమగ్రంగా వివరించారన్నారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, మండలాధ్యక్ష కార్యదర్శులు సుబ్బయ్య, సయ్యద్ బాష, బాబుల్‌రెడ్డి, కాశీం, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు : స్థానిక ఎస్ఆర్ఐటీ ఇంజనీరింగ్ కాలేజీలో సోమవారం డీవైఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రూపొందించిన 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను కళాశాల కరస్పాండెంట్ వీరకళ్యాణ్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతను చైతన్యపరచేలా క్యాలెండర్‌ను డీవైఎఫ్ఐ రూపొందించడం అభినందనీయమన్నారు. డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి ప్రభుత్వం యువతకు ఇచ్చిన హామీలను అమలు పరిచే విధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి విశ్వనాథ్, చంటి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి



మాట్లాడుతున్న ఎంపీపీ కానాల జయచంద్రారెడ్డి

దువ్వూరు : అధికారులు ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎంపీపీ కానాల జయచంద్రారెడ్డి తెలిపారు. దువ్వూరు ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో సోమవారం ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ రైతులకు, ప్రజలకు సాగు, తాగునీటికి ఇబ్బంది లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధి హామీ పథకం కింద పనులను గుర్తించి ప్రజలకు జీవనోపాధి కల్పించాలని సూచించారు. ప్రజాప్రతినిధులు ఉపాధి హామీ పథకం కింద ప్రజలకు పనులు కల్పించి గ్రామాభివృద్ధికి కృషి చేయాలన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా రబీ సీజన్‌లో ఎరువులు, విత్తనాలు అందించాలని వ్యవసాయాధికారులకు తెలిపారు. అకాల వర్షాలతో పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతుల వివరాలను ప్రభుత్వానికి నివేదికలు పంపి నష్టపరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. మండల వ్యవసాయాధికారి అమరనాథ్ రెడ్డి మాట్లాడుతూ రబీ సీజన్‌లో ఎలాంటి ఇబ్బంది లేకుండా రైతులకు ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు అన్ని సకాలంలో అందించామన్నారు. రబీ సీజన్‌లో ఇప్పటికే దాదాపు 4వేల ఎకరాల్లో ఈ–క్రాప్ చేశామన్నారు. ఇంకా రెండు వేల ఎకరాలకు ఈ–క్రాప్ నమోదు చేయాల్సి ఉందన్నారు. ఈ సీజన్‌లో ఇంకా పంటలు వేయాల్సి ఉన్నందున ఈ–క్రాప్ చేయడంలో ఆలస్యమవుతోందని తెలిపారు. రైతులు పంటల నమోదును కచ్చితంగా చేయించుకోవాలని పేర్కొన్నారు. ఎంఈఓ రవిశంకర్ మాట్లాడుతూ నాడు–నేడు పనులకు సంబంధించి అన్ని పాఠశాలల్లో పనులు దాదాపు పూర్తయ్యాయన్నారు. కొన్ని పాఠశాలల్లో నిధుల కొరతతో పనులు పూర్తి కాలేదన్నారు. ఐసీడీఎస్ సీడీపీఓ సావిత్రమ్మ మాట్లాడుతూ మండలంలోని 17 అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతుల కింద తాగునీరు, టాయిలెట్ల కోసం నిధులు మంజూరయ్యాయని తెలిపారు. ఇప్పటికే అంగన్‌వాడీ కేంద్రాల్లో పనులు దాదాపు చేపట్టామన్నారు. మిగతా శాఖలపై ఆయా శాఖల అధికారులు ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రామకృష్ణయ్య, తహసీల్దార్ అక్బల్ బాషా, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సావిత్రమ్మ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

డోర్ డెలివరీ సేవలు సద్వినియోగం చేసుకోండి



విజేతలను ప్రకటిస్తున్న ఆర్టీసీ డీఎం నిరంజన్

బద్వేలు అర్బన్ : ఆంధ్రప్రదేశ్ రోడ్డు రవాణా సంస్థ ఆధ్వర్యంలో నూతనంగా ప్రారంభించిన కార్గో రవాణా డోర్ డెలివరీ సేవలు ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని బద్వేలు డిపో మేనేజర్ ఆర్.సి. నిరంజన్ తెలిపారు. డోర్ డెలివరీ మాసోత్సవాల్లో భాగంగా కార్గో సేవలను సద్వినియోగం చేసుకున్న వారిలో లక్కీడ్రిప్ ద్వారా ముగ్గురు విజేతలకు బహుమతులు అందజేశారు. సోమవారం బస్టాండు ఆవరణలోని పార్శిల్ సర్వీసు కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఆర్టీసీలో కార్గో సేవలు ద్వారా ప్రజాభిమానాన్ని చూరగొన్న సంస్థ మరో అడుగు ముందడుగు వేసి డోర్ డెలివరీ సౌకర్యాన్ని కూడా అందుబాటులోకి తెచ్చిందని, ఈ విధానంలో చిన్నసైజు కవర్ల నుంచి 50 కేజీలలోపు బరువు గల వస్తువులను పది కిలోమీటర్ల విస్తీర్ణంలోపు డోర్ డెలివరీ చేయడం జరుగుతుందని తెలిపారు. లక్కీ డ్రిప్‌లో కె.ఎస్.జె.ఎస్.రావు, ఎం.ఈశ్వరమ్మ, డాక్టర్ ప్రశాంత్‌లు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను కైవసం చేసుకున్నారు. కార్యక్రమంలో ఎస్టీఐ బి.ఎస్.నాయక్, ఏడీసీలు ఎస్.ఎం.బాష, సుందరయ్య, సిస్టమ్ సూపర్‌వైజర్ చంద్ర, డీఎం ఈఈ శ్రీనివాసులు, ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదులపై డీఎల్‌పీఓ విచారణ



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న డీఎల్‌పీఓ తిమ్మక్క

ప్రొద్దుటూరు రూరల్ : కొత్తపల్లె గ్రామ పంచాయతీ నుండి రెండు గ్రామాల ప్రజలు కడప కలెక్టర్ కార్యాలయంలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో చేసిన ఫిర్యాదుల మేరకు సోమవారం డీఎల్‌పీఓ తిమ్మక్క గ్రామ పంచాయతీకి వచ్చి విచారణ జరిపారు. ఖాదరబాద్ గ్రామానికి చెందిన టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర క్యాదర్శి సుంకర వేణుగోపాల్ కొత్తపల్లె గ్రామ పంచాయతీలో నిర్మితమవుతున్న అక్రమ వెంచర్లు, ఇరిగేషన్ కాలువల ఆక్రమణపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. గ్రామ పంచాయతీలో వెలిసే లే అవుట్ల యజమానులు భూములు ల్యాండ్ కన్వర్షన్ చేయకుండా వెంచర్లు వేస్తున్నారని, దీని వల్ల ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోందని, ఇరిగేషన్ కాలువలను ఆక్రమించి ప్లాట్లుగా విక్రయిస్తున్నారని ఫిర్యాదు చేశారు. అలాగే డీఎస్ఆర్ కాలనీకి చెందిన ఖలందర్ బాష అనే వ్యక్తి తమ కాలనీలో రోడ్లు, కాలువలకు ఇరువైపులా ఆక్రమించుకుని తావలు, కాంపౌండ్ నిర్మాణాలు చేపడుతున్నారని, వాటిని తొలగించాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుల మేరకు తాను విచారణ చేసి ఫిర్యాదుదారులతో వాస్తవాలను తెలుసుకునేందుకు గ్రామ పంచాయతీ కార్యాలయానికి వచ్చినట్లు డీఎల్‌పీఓ తిమ్మక్క తెలిపారు. ఈ ఫిర్యాదులపైన క్షేత్రస్థాయిలో పర్యటించి వాస్తవాలను తెలుసుకుని వారికి నోటీసులు జారీ చేయాలని ప్రొద్దుటూరు మండల ఈఓపీఆర్డీ రామాంజనేయరెడ్డిని ఆమె ఆదేశించారు. అనంతరం ఫిర్యాదుదారులతో స్టేట్‌మెంట్ నమోదు చేశారు.

పేదలందరికి ఇంటి స్థలం ఇవ్వాలి

అట్లూరు : మండలంలోని కొండూరు గ్రామంలో అర్హులైన పేదలందరికి ఇంటి స్థలం ఇవ్వాలని సీపీఐ ఏరియా సమితి ఆధ్వర్యంలో సోమవారం అప్లికేషన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీపీఐ ఏరియా కార్యవర్గ సభ్యులు పి.వి.రమణ మాట్లాడుతూ అర్హులైన పేదలందరికి గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు ఇంటి స్థలం, గ్రామీణ ప్రాంతాల్లో అర్హులైన ప్రతి ఒక్కరికి రెండు ఎకరాలు సాగు భూమి ఇస్తామని ఎన్నికల సమయంలో ప్రభుత్వం హామీ ఇచ్చిందని, ఆ హామీని నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. అర్హులైన పేదలందరికి ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 10న సీపీఐ ఆధ్వర్యంలో అన్ని తహసీల్దారు కార్యాలయాల ఎదుట ధర్నా నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, అర్హులు ఈ ధర్నా కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ మండల నాయకులు పాల్గొన్నారు.

విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టిస్తున్న 'కూటమి'



మాట్లాడుతున్న నాగార్జునరెడ్డి

పోరుమామిళ్ల : రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టిస్తోందని పీఆర్‌ఆర్‌డీ రాష్ట్ర ప్రభుత్వ మాజీ సలహాదారు నాగార్జునరెడ్డి విమర్శించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వ హయాంలో విద్యారంగ అభివృద్ధికి కృషి చేశారని తెలిపారు. నాడు–నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలు అద్భుతంగా తీర్చిద్దారని గుర్తుచేశారు. అయితే కూటమి ప్రభుత్వంలో రాష్ట్రంలో 54 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు అంధకారంగా మారిందన్నారు. జగనన్న ప్రవేశపెట్టిన సీబీఎస్ విధానాన్ని రద్దు చేశారని తెలిపారు. ఎన్నికల ముందు ఇంట్లో ఎంత మంది పిల్లలుంటే అందరికీ రూ. 15 వేలు ఇస్తామని వాగ్దానం చేసిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు మోసం చేసిందని మండిపడ్డారు.

పార్టీ పురోభివృద్ధికి కృషి చేయండి

ఎమ్మెల్యే డాక్టర్ సుధ



లక్ష్మీనరసారెడ్డిని ఘనంగా సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు



ఎమ్మెల్యే డాక్టర్ సుధను సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

బద్వేలు అర్బన్ : ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ వైఎస్సార్‌సీపీ పురోభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ సుధ పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధిగా, జిల్లా ఉపాధ్యక్షుడుగా నియమితులైన బోడపాటి రామసుబ్బారెడ్డి, గానుగపెంట రమేష్‌బాబులు సోమవారం మున్సిపల్ కార్యాలయంలోని చైర్మన్ ఛాంబర్‌లో ఎమ్మెల్యే డాక్టర్ సుధను మర్యాదపూర్వకంగా కలిసి పూలమాల, శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడి పనిచేసే వారికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో సముచిత స్థానం లభిస్తుందని అన్నారు. వివిధ పదవుల్లో నూతనంగా నియమితులైన వారు కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా పనిచేయాలని సూచించారు.

శుభాకాంక్షల వెల్లువ

నూతన సంవత్సర వేడుకలకు అందుబాటులో లేక సోమవారం బద్వేలుకు విచ్చేసిన ఎమ్మెల్యే డాక్టర్ సుధకు మున్సిపాలిటీతో పాటు వివిధ మండలాల నాయకులు శుభాకాంక్షలు తెలియజేశారు. స్థానిక ఎన్‌జీఓ కాలనీలోని ఎమ్మెల్యే కార్యాలయంలో బద్వేలు మున్సిపాలిటీ, రూరల్, గోపవరం మండలాల నాయకులు ఎమ్మెల్యేను కలిసి శాలువా, పూలమాలలతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ సాయికృష్ణ, వైఎస్సార్‌సీపీ నగర విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బంగారుశీనయ్య, మున్సిపాలిటీ అధ్యక్షుడు సుందర్‌రామిరెడ్డి, కన్వీనర్ యద్దారెడ్డి, ఆయా కార్పొరేషన్ల మాజీ డైరెక్టర్లు పుత్తాశ్రీరాములు, కేశవరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, అట్లూరు మండల కన్వీనర్ ఎం.ప్రభాకర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.బ్రహ్మానందరెడ్డి, మున్సిపాలిటీ ఏరియా కన్వీనర్ చెన్నకృష్ణారెడ్డి, గోపవరం మండల జేసీఎస్ కన్వీనర్ పుల్లయ్య పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి

బద్వేలు : వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేస్తామని ఆ పార్టీ అధికార ప్రతినిధి బిజవేముల రామసుబ్బారెడ్డి (బోడపాడు), జిల్లా ప్రధాన కార్యదర్శిగా పొన్నవోలు బ్రహ్మానందరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు గానుగపెంట రమేష్‌బాబు తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్యే డాక్టర్ సుధను వారు కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు ఈ పదవులు వచ్చేందుకు కృషి చేసిన ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, జిల్లా పార్టీ అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి, ఎమ్మెల్యే సుధ, ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, బద్వేల్ మున్సిపల్ చైర్మన్ వాకమల్ల రాజగోపాల్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏపీఐఐసీ డైరెక్టర్ గోపవరం ప్రభాకర్‌రెడ్డి, 28వ వార్డు ఇన్‌చార్జి చెన్నక్రిష్ణారెడ్డి, మాజీ మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ శ్రీరాములు, అట్లూరు మండల నాయకుడు ప్రభాకర్‌రెడ్డి, చెన్నంపల్లె వెంకటసుబ్బయ్య, తిరువెంగళాపురం మాజీ సర్పంచ్ రఘురామిరెడ్డి పాల్గొన్నారు.

సన్మానం

వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పొన్నవోలు బ్రహ్మానందరెడ్డిని ఆ పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు.

లక్ష్మీనరసారెడ్డికి ఘన సన్మానం

బి.కోడూరు : వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు అన్ని జిల్లాలకు వైఎస్సార్‌సీపీ కమిటీలను నియమించింది. అందులో భాగంగా కడప జిల్లాకు కూడా కమిటీలను నియమించారు. ఇందులో భాగంగా వైఎస్సార్‌సీపీ జిల్లా ఆర్గనైజేషన్ సెక్రటరీగా నియమితులైన పెద్దిరెడ్డి లక్ష్మీనరసారెడ్డిని వైఎస్సార్‌సీపీ బూత్‌కన్వీనర్లు వెంకటేశ్వర్‌రెడ్డి, ఎం.రామసుబ్బయ్య, రమేష్, నాయకులు పెద్దరామయ్య, చిన్నరామయ్య, పద్మనాభరెడ్డి, ఖాసీం, తిరుపాల్‌రెడ్డిలు సోమవారం అంకనగొడుగునూరులో శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

సమాజ సేవలో 'రాస్'

ప్రొద్దుటూరు : సమాజ సేవ కోసం రాష్ట్రీయ సేవా సమితి(రాస్) అనేక సేవా కార్యక్రమాలను చేస్తోందని రాస్ కార్యవర్గ సభ్యుడు శెట్టిపల్లె రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. సోమవారం రామేశ్వరంలోని వికాస్ విహార్‌లోని మానసిక వికలాంగుల శిక్షణ కేంద్రంలో రాస్ వ్యవస్థాపకుడు మునిరత్నం నాయుడు జయంతిని ఘనంగా నిర్వహించారు. చిన్నారులకు పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. రోటరీక్లబ్ ప్రొద్దుటూరు డిస్ట్రిక్ట్ గవర్నర్ సాధు గోపాలకృష్ణ మాట్లాడుతూ జనవరి 29న రోటరీ తరపున రాస్‌కు ప్రైడ్ ఆఫ్ ఇండియా అవార్డు బహుకరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రొటేరియన్ మురుకూటి సూర్యనారాయణరెడ్డి, రిటైర్డ్ హెడ్మాస్టర్ కాశీప్రసాద్ రెడ్డి, వికాస్ విహార్ నిర్వాహకురాలు ఝాన్సీరాణి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ పోటీలకు ఎంపిక

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక ఎల్ఐసీ కార్యాలయం సమీపంలోని పీస్ హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు అబ్దుల్లా, ఆసిఫ్ జాతీయ స్థాయి అండర్–17 క్రికెట్ పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల ఒంగోలులో ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన స్టేట్ టీ20 క్రికెట్ చాంపియన్ షిప్ రాష్ట్రస్థాయి అండర్ –17 క్రికెట్ పోటీల్లో వీరు ప్రతిభ కనపరచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఆగ్రాలో ఈ నెల 26 నుంచి జరుగనున్న జాతీయ స్థాయి అండర్–17 జాతీయ స్థాయి క్రికెట్ పోటీల్లో పాల్గొననున్నారు. పోటీలకు ఎంపికైన విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ అశ్వాక్ అభినందించారు.